సాక్షి
చిత్తూరు
బుధవారం। 20। ఆగస్టు। 2025



నమ్మండి.. రోడ్డేనండి

చిత్తూరు జిల్లాలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఇటీవల వర్షాలకు మరింత దారుణంగా తయారయ్యాయి. - 8లో



పైరవీలకే 'రిజర్వేషన్'

ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ పైరవీలకే పరిమితమైందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. - 8లో



ఎలుక దెబ్బకు 'రీసౌండ్'!

పలమనేరులో ఎలుక దెబ్బకు పట్టణమంతా రీసౌండ్ వస్తోంది. ఏమైందో తెలియక పలువురు పరుగులు తీస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. స్థానిక గాంధీ రోడ్డులోని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు గ్రీవెన్స్ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎంపీహెచ్‌డబ్ల్యూ ఉచిత కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ తెలిపారు. ఈ కోర్సు శిక్షణ కాలం రెండేళ్ల పాటు ఉంటుందన్నారు. చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రి, తిరుపతి రుయా, తిరుపతిలోని రాస్, చిత్తూరులోని శ్రీనివాస, పుత్తూరులోని సెయింట్‌మేరిస్, లక్ష్మీనారాయణ శిక్షణ కేంద్రాల్లో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుకు శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను శిక్షణ కేంద్రానికి లేదా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై, 17 ఏళ్లు పూర్తై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు సడలింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

కలెక్టర్ ఆదేశించినా చర్యలేవీ?

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అక్రమ స్కానింగ్ విషయంలో ఓ ఆశ వర్కర్‌ను తొలగించాలని కలెక్టర్ ఆదేశించినా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బేఖాతార్ చేస్తున్నారు. మేలో చిత్తూరు నగరంలోని భరత్‌నగర్‌లో అక్రమ స్కానింగ్ సెంటర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో 20 మందిపైగా కేసు నమోదైంది. ఇందులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే సిబ్బంది హస్తం ఉందని తేలింది. కానీ ఆ సిబ్బందిపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు. పోలీసుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంటనే సిబ్బంది(ఆశ వర్కర్)ను తొలగించాలని ఆదేశించారు. దీంతో హడవిడి చేసిన ఆ శాఖ అధికారులు తొలగింపు చర్యను నొక్కిపెట్టేశారు. ప్రభుత్వ విధుల్లో పనిచేస్తూ..కేసు నమోదైతే నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలనే నిబంధన ఉన్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ స్కానింగ్ విషయంలో ఆ శాఖలోని అధికారులతో ఏమైనా సంబంధాలున్నాయా... అందుకే ఈ విషయంలో మౌనం పాటిస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ఏనుగులున్నాయ్ జాగ్రత్త



అటవీ ప్రాంతం సమీపంలో ఒంటరి ఏనుగు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు, పదిపుట్ల బైలు రిజర్వు ఫారెస్టులో ఒంటరి ఏనుగు సంచరిస్తోందని, రైతులు సమీప పొలాల్లోకి వెళ్లొద్దని అటవీశాఖ అధికారులు సూచించారు. రాత్రి పూట పొలాలవద్దకు వెళ్లరాదని, అలాగే తెల్లటి దుస్తులు ధరించరాదని పేర్కొన్నారు. ఏనుగులు కనిపిస్తే తరమడం, అదిలించడం లాంటివి చేయరాదని, వెంటనే 9550067503 నంబర్‌కి ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

టీకాలు విధిగా వేయించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పిల్లలకు రొటీన్ టీకాలు విధిగా వేయించాలని ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం వ్యాధి నిరోధక టీకాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులు చంటిబిడ్డలకు రాకుండా ముందే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. 0–5 లోపు పిల్లలకు టీకాలు వేయించే విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. విధిగా పల్లెల్లోని పిల్లలకు టీకాలు వేయించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. అనంతరం డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ మౌనిక స్టెఫి థామస్ వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు.

నేడు హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు బుధవారం జరగనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆస్థాన మండపంలో లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

దోమల దండయాత్ర!



- 15 రోజుల క్రితం చిత్తూరు నగరానికి చెందిన ఏడేళ్ల బాలుడికి వీడని జ్వరం ఉండడంతో తల్లిదండ్రులు మిట్టూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు రక్త పరీక్షల కోసం ఆ ఆస్పత్రి పక్కనే ఉన్న ఓ ల్యాబ్‌కు రెఫర్ చేశారు. అక్కడ రూ.2 వేలతో కొన్ని బ్లడ్ టెస్టులు చేశారు. ఆపై డెంగీ పరీక్షకి రూ.5వేలు బిల్ వేశారు. ఇంతెందుకు.. తగ్గించుకోండి అంటే.. లేదు మీరు వేరేచోట చూపించుకోండి అంటూ ల్యాబ్ నిర్వాహకులు ఉచిత సలహాలు ఇచ్చారు. చేసేది లేక రూ.5వేలు ఇచ్చి పరీక్ష చేయించారు. అది డెంగీ అని తేలడంతో వేలూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించగా డెంగీ లేదని, వైరల్ ఫీవర్ అని తేల్చారు. దీంతో తల్లిదండ్రులు ఖంగుతిన్నారు.
- తొమ్మిదేళ్ల బాలికకు తీవ్ర జ్వరం రావడంతో తల్లిదండ్రులు చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం దగ్గర్లో ఉన్న ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ రక్త పరీక్షలు, డెంగీ పరీక్షల పేరుతో రూ.7వేల వరకు గుంజుకున్నారు. ఆ తర్వాత రెండు రోజుల పాటు అడ్మిట్ చేసుకుని అందుకు అదనంగా రూ.5 వేలు దండుకున్నారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో చీలాపల్లిలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది.

.. ఇవి మచ్చుకు రెండు ఘటనలు మాత్రమే. ఇలాంటివి జిల్లాలో నిత్యకృత్యంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక దోమల నివారణకు తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారు. దీంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. గతంలో వర్షాలు మొదలవ్వగానే దోమలు విజృంభించేవి. ఇప్పుడు ఏడాదంతా దాడి చేస్తున్నాయి. రాత్రయితే దోమల మోత మోగుతోంది. దోమల పేరు చెప్పి పలు ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు దోచుకుంటున్నాయి. నేడు ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

- దోమ కాటుకు గురవుతున్న ప్రజలు
- విజృంభిస్తున్న విషజ్వరాలు
- అధికమవుతున్న డెంగీ కేసులు
- క్షేత్ర స్థాయిలో కనిపించని పారిశుద్ధ్య చర్యలు
- నేడు ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దోమలు దడపుట్టిస్తున్నాయి. రాత్రి అయితే ప్రజలపై దాడి చేస్తున్నాయి. వీటి దెబ్బకు డెంగీ కేసులు విజృంభిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు 70 డెంగీ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. అనధికారికంగా డెంగీ కేసులు వంద దాటినట్టు సమాచారం. ప్రైవేటు ఆస్పత్రుల్లో గుర్తించే కేసులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. జిల్లా ప్రభుత్వాస్పత్రుల్లో నమోదయ్యే కేసులతో పాటు వేలూరు, చీలాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వచ్చే కేసులను మాత్రమే అధికారులు లెక్క కడుతున్నారు.

విజృంభిస్తున్న దోమలు

ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వాన్నంగా మారింది. దోమలు విజృంభిస్తున్నాయి. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నా కేసుల సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. డెంగీ దోమలు పెరిగేందుకు కారణమయ్యే మంచినీటి నిల్వలు, తాగేసిన కొబ్బరి బోండాలు, ఖాళీ సీసాలు, పూలకుండీలు, పాత టైర్లు అలాగే వదిలేయడంతో సమస్య తీవ్రమవుతోంది. క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్యం లోపించడం, బ్లీచింగ్, ఫాగింగ్ చర్యలు నామమాత్రంగా ఉండడంతో దోమల వృద్ధి పెరుగుతోంది.



ఫ్రైడేని..డ్రైడేగా నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

దోమల పేరుతో దోపిడీ!

ప్రధానంగా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు సీజనల్ వ్యాధులను అవకాశంగా చేసుకుని దోచుకుంటున్నాయి. డెంగీ, టైఫాయిడ్, విషజ్వాల పేరుతో ప్రజలను నిలువునా ముంచేస్తున్నాయి. ల్యాబ్ పరీక్షల పేరుతో రూ.1000 నుంచి రూ.10 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నాయి. చికిత్స పేరుతో అడ్మిట్ చేసుకుని రూ.లక్ష వరకు గుంజుకుంటున్నాయి.

పట్టించుకోని అధికారులు

పలు ప్రయివేటు ఆస్పత్రులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు కుర్చీలకు అత్తుకుపోయారు. ప్రజల రక్తాన్ని పిండేస్తున్నా చూసీచూడనట్లు వెళ్లిపోతున్నారు. దోమల పేరుతో దోపిడీ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇక దోమల నివారణపై అవగాహన కల్పించడంలో అధికారులు షో చేసి వెళ్లి పోతున్నారు. ర్యాలీ పేరుతో కార్యాలయం చుట్టూ నాలుగు అడుగులు వేసి కాళ్లకు నొప్పి లేకుండా..దోమకు దెబ్బ తగలకుండా మిన్నకుండిపోతున్నారు. ఎక్కడ దోమలు చనిపోతాయోనని ఫాగింగ్ కూడా చేయడం మానేశారు. దీంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి 1	ఏరియా ఆస్పత్రులు 4
సీహెచ్‌సీలు 8	అర్బన్ హెల్త్ సెంటర్లు 15
పీహెచ్‌సీలు 50	ప్రయివేటు ఆస్పత్రులు 1,500
ఆర్‌ఎంపీ క్లినిక్‌లు 2వేల వరకు	ల్యాబ్‌లు 1,250
అనధికారికంగా ఉన్న ల్యాబ్‌లు 500 పైగా	

అవగాహన రావాలి



మేమైతే పదేపదే చెబుతున్నాం. ఇళ్లు శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి చుట్టూ శుభ్రంగా ఉండాలి. మురుగునీరు బయట వదలకండి. గుంత తవ్వి వదలండి. కానీ ఎవరు వింటున్నారు మా మాటలు. అంతా నిర్లక్ష్యంగా ఉన్నారు. ప్రజల్లో అవగాహన రావాలి. బాధ్యతగా వ్యవహరించాలి. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

–వేణుగోపాల్, జిల్లా మలేరియా అధికారి, చిత్తూరు

శబరిమలైకు పెద్దిరెడ్డి



తిరుపతిలో తన ఇంటి నుంచి శబరిమలైకు వెళ్తున్న రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన అనుచరులతో కలసి మంగళవారం శబరిమలై యాత్రకు బయలుదేరి వెళ్లారు. తిరుపతిలోని కపిలతీర్థం వద్ద గల శివాలయంలో పూజలు చేసి, ఇంట్లో ఇరుముడి కట్టుకుని బయలుదేరి వెళ్లారు. మూడు రోజుల పాటు శబరిమలై యాత్ర చూసుకుని, తిరిగి శనివారం దీక్షలు విరమించి తిరుపతికి చేరుకోనున్నారు. ఈయన వెంట ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప, కొండవీటి నాగభూషణం తదితరులు ఉన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన



కో–ఆర్డినేటర్ రామకృష్ణారావ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ రామకృష్ణారావ్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా ఏరువాక కార్యక్రమంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ దృష్ట్యా జిల్లాలో మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేడీఏ మురళీకృష్ణ

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి పంచాయతీ, కమ్మినాయునిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి, చిత్తూరు వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, రికార్డులను పరిశీలించారు. తదుపరి రాజుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గత మూడేళ్ల మట్టి నమూనా ఫలితాలను పరిశీలిస్తే మన నేలల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్నందున రైతులు తప్పకుండా పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగను వేయాలన్నారు. యూరియా ఎక్కువగా వాడడం వల్ల కలిగే అనర్థాలు, నానో యూరియా వల్ల ఉపయోగాలను వివరించారు. అన్నదాత సుఖీభవ రాని రైతులు రైతు సేవా కేంద్రంలో 20వ తేదీలోగా గ్రీవెన్స్ నమోదు చేయాలన్నారు. తర్వాత గ్రామం సమీపంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఆయన వెంట పుంగనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శివకుమార్, ఏఓ హేమలత, పంచాయతీ కార్యదర్శి రిజ్వానా, వీఆర్వో కృష్ణంరాజు ఉన్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



తిరుమాడ వీధుల్లో ఊరేగుతున్న సేనాధిపతి

కార్వేటినగరం: కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు మంగళవారం వైభవంగా అంకురార్పణ చేపట్టారు. స్వామివారిని వేకువజామున మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉభయ దేవేరులతోపాటు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అంకురార్పణ కార్యక్రమానికి ముందే పవిత్రమైన పుట్టమట్టితో ఆలయ ఆవరణలో మేదినీ దేవిని ప్రతిష్ఠించి అత్యంత వైభవంగా పూజలు, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం సాయంత్రం సేనాధిపతి ఉత్సవ సమర్పణ, రాత్రి మృత్సంగ్రహణం, అంకురార్పణ, యాగశాల, వైదిక కార్యక్రమాలు చేపట్టారు. విశ్వక్సేనుని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, వేద పండితులు రమేష్, శభరీష్, గోపాలస్వామి పాల్గొన్నారు.



మేదినీ దేవికి ప్రత్యేక పూజలు

నేడు పవిత్రాల సమర్పణ

బుధవారం ఉదయం కోదండరామస్వామికి ఏకాంత తిరుమంజనం, యాగశాలలో మధ్యాహ్నం వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. తర్వాత పవిత్రాల సమర్పణ ఉంటుందన్నారు.

పాదయాత్ర భగ్నం

చంద్రగిరిలో ఉద్రిక్తత..!

- ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు నుంచి బయటపడాలని అభిమానుల పాదయాత్ర
- పాదయాత్రను అడ్డుకుని స్టేషన్‌లో నిర్బంధించిన పోలీసులు
- పోలీసుల తీరుతో శ్రీవారిమెట్టు వద్ద భయభ్రాంతులకు గురైన భక్తులు
- డీఎస్పీ ప్రసాద్ మీడియాపై ఆంక్షల పేరుతో చిందులు



అక్రమ అరెస్టు నుంచి బయటకు వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



అక్రమ అరెస్టుపై మండిపడుతున్న విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్



శ్రీవారిమెట్టులో పాదయాత్రగా వెళ్తున్న వ్యక్తిని ఈడ్చుకెళ్తున్న పోలీసులు

చంద్రగిరి : శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంపై చంద్రగిరిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు నుంచి త్వరగా బయటకు రావాలని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్రను చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ పోలీసులు మంగళవారం శ్రీవారిమెట్టు వద్ద అడ్డుకున్నారు. శ్రీవారిమెట్టు నుంచి తిరుమలకు వెళ్తున్న వారిని అక్రమంగా అడ్డుకోవడంతో పాటు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అభిమానులను ఈడ్చుకొంటూ స్టేషన్‌కు తరలించారు. దీంతో తిరుమలకు వెళ్తున్న భక్తులు సైతం తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

సుమారు 4 గంటల పాటు స్టేషన్‌లో..

పాదయాత్ర చేస్తున్న హరిప్రసాద్ రెడ్డితో పాటు సుమారు 17 మందిని చంద్రగిరి డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు పోలీసు స్టేషన్‌లోనే అక్రమంగా నిర్బంధించారు. హరిప్రసాద్ రెడ్డిను అరెస్టు చేశారని తెలుసుకున్న పార్టీ శ్రేణులు భారీగా పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

అరాచక పాలన

సుమారు 4 గంటల పాటు పోలీసు స్టేషన్‌లో నిర్బంధించిన నేతలను పోలీసులు సొంత పూచీకత్తుపై రాత్రి విడుదల చేశారు. తిరుమల పాదయాత్రలో ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తుగా అరెస్టు చేసి, విడిచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. టీటీడీ చైర్మన్ ఆదేశాలతోనే అక్రమంగా అరెస్టు చేశారంటూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ ఆరోపించారు. శాంతియుతంగా చేస్తున్న పాదయాత్రను అడ్డుకోవడం ఏమిటంటూ మండిపడ్డారు. తిరుమలకు వెళ్లాలంటే కూటమి ప్రభుత్వంలో పాస్‌పోర్టు, వీసా కావాలా అంటూ ఆయన ప్రశ్నించారు.



చంద్రగిరి పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మీడియాపై డీఎస్పీ చిందులు

వైఎస్సార్‌సీపీ శ్రేణుల అక్రమ అరెస్టు తెలుసుకున్న జర్నలిస్టులు పోలీసు స్టేషన్‌కు వెళ్లడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసు స్టేషన్‌లోకి ఎలా వస్తారంటూ చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ చిందులు వేశారు. జర్నలిస్టుగా వచ్చామని, అరెస్టుకు సంబంధించి వివరాలు తెలపాలని కోరడంతో ఆయన ఆంక్షల పేరుతో చిందులు వేయడంపై పాత్రికేయులు మండిపడ్డారు.

ప్రశాంత వాతావరణంలో బ్రహ్మోత్సవాలు



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

కాణిపాకం: కాణిపాక వరసిద్ధుని వార్షిక బ్రహ్మోత్సవం ప్రశాంతంగా జరిగేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని ఈవో పెంచలకిషోర్, ఏఎస్పీ నందకిషోర్ పిలుపునిచ్చారు. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఆవరణలో మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈనెల 27 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ముందస్తుగా అన్ని శాఖల అధికారులు కలిసి మాక్ డ్రిల్ చేపట్టారు. దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయం లోపలి భాగంలో ఏదైనా జరిగితే... వారిని ఎలా ఆస్పత్రికి చేర్చాలి, అగ్నిప్రమాదం జరిగితే ఏవిధంగా స్పందించాలి, ఏ రకంగా మంటలను అదుపు చేయాలనే విషయంపై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అధికారులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా వ్యహరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు సాయినాథ్, చిన్నికృష్ణ, ఆర్‌ఐ సుధాకర్, ఎస్‌ఐ నరసింహులు, కానిస్టేబుల్ మధు, అగ్నిమాపక, వైద్యాశాఖ, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధం

పూతలపట్టు(యాదమరి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఫొటో స్టూడియోలోని ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుని కథనం.. మండల కేంద్రంలోని పంచాయతీ దుకాణ సముదాయంలో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం స్టూడియో యజమాని తన సిబ్బందితో కలిసి కాణిపాకంలోని ఓ వివాహ వేడుకకు వెళ్లారు. పనులు ముగించుకుని స్టూడియోకి వచ్చిన సిబ్బందికి లోపల నుంచి పొగ రావడంతో వెంటనే యజమానికి సమాచారం అందించారు. అప్పటికే పలు విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమైనట్లు గుర్తించారు. ఈ ఘటనపై చిత్తూరు ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ విచారం వ్యక్తం చేసింది.

అక్రమ స్కానింగ్ పై విచారణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అక్రమ స్కానింగ్ బాగోతంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు లోతుగా విచారణకు దిగారు. ఈ నెల 10న సాక్షి దినపత్రికలో అక్రమ స్కానింగ్ అంతేనా? శీర్షికన వార్త వెలువడింది. దీనిపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. తిరుపతి, చిత్తూరులో అక్రమ స్కానింగ్ చేస్తూ పట్టుబడ్డ వారి వివరాలను ఆరా తీస్తున్నారు. ఈ రెండు కేసులలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే అధికారులు, సిబ్బంది హస్తం ఉందా..? అనే కోణంలో విచారణ జరుగుతోంది. అలాగే పట్టుబడ్డ స్కానింగ్ మిషన్లు... వాటిని అక్రమార్కులు ఎక్కడి నుంచి కొనుగోలు చేశారనే వివరాల కోసం పట్టుబడుతున్నారు. ఈ విచారణ పూర్తయినా తర్వాత డీఎంఅండ్‌హెచ్ఓకు నివేదికలు సమర్పించనున్నారు. ఈ మేరకు అక్రమ స్కానింగ్‌కు సహకరించిన అధికారులు, సిబ్బందిపై వేటు పడే అవకాశాలున్నాయి. కాగా అక్రమ బాగోత కేసు వివరాలపై చిత్తూరు వన్ టౌన్ పోలీసులకు రాతపూర్వకంగా వివరాలు కోరనున్నామని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 35 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 35 మందికి రూ.3.5 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 35 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.3.5 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?



మాట్లాడుతున్న రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బకాయిలు ఇంకెప్పుడు చెల్లిస్తారని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా అవుతోందన్నారు. అయితే ఇప్పటి వరకు ఉద్యోగ, పెన్షనర్, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిల విషయం ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించడంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

నమ్మండి.. రోడ్డేనండి

చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. కొన్ని రోడ్లపై మోకాటి లోతు గుంతలు ఏర్పడ్డాయి. మరికొన్ని కంకర తేలిపోతున్నాయి. అటువైపు వెళ్లే పాదచారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరి వాహన చోదకులను బోల్తా కొట్టిస్తున్నాయి. నిత్యం ప్రమాదాలకు నిలయాలుగా మారిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా వీటి గురించి పట్టించుకోవడం మానేసింది. కొన్ని చోట్ల అభివృద్ధి పనులు చేస్తున్నామంటూ హడావుడిగా నాణ్యతలేని రోడ్లు వేసి చేతులు దులుపుకుంది. ఇవి మూన్నాళ్ల ముచ్చటగా మారడంతో నిత్యం నరకం కనిపిస్తోంది. జిల్లాలో దెబ్బతిన్న రోడ్లు.. వాటి దుస్థితిపై సాక్షి స్పెషల్ ఫోకస్..

కళ్లకు గంత..అడుగుకో గుంత



కాణిపాకం: వర్షానికి కుంగిన యాదమరి-గుడియాత్తం రోడ్డు (భూమిరెడ్డి బస్టాప్ వద్ద)



కాణిపాకం: యాదమరి మండలంలోని ఓట్టేరుపల్లి రోడ్డు



కాణిపాకం: ఊటువంక సమీపంలో దెబ్బతిన్న బంగారుపాళ్యం-రాగిమాని పెంట రోడ్డు

కాణిపాకం: యాదమరి, బంగారుపాళెం మండలాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. పలు మార్గాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. అడుగుకో గుంత దర్శనమిస్తోంది. అందులో వర్షపు నీరు చేరి ప్రయాణం నరకంగా మారింది. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యంగా మారుతోంది.



కాణిపాకం: గుంతలు పడ్డ బంగారుపాళ్యంలోని కురపల్లి రోడ్డు



కాణిపాకం: గుంతల మయంగా యాదమరి మండలంలోని కొటాల రోడ్డు

రోడ్లు ధ్వంసం

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షాలకు కొత్త రోడ్లు వానకు కొట్టుకుపోయాయి. కొన్నిచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. చిత్తూరు నగరంలోని గురునగర్ కాలనీలో రూ.40 లక్షలతో కూటమి ప్రభుత్వం వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇక ఓవర్ బ్రిడ్జి, సంతపేట, గాంధీ రోడ్డు ప్రాంతాల్లో మోకాటి లోతు గుంతలతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



చిత్తూరు మండలం, బండపల్లె సమీపంలో గుంతలు పడ్డ జీకే.పురం రోడ్డు



చిత్తూరు గురునగర్ కాలనీలో గుంతలమయంమైన రోడ్డు

ప్రయాణం నరకం

కార్వేటినగరం: జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో నిర్మించిన రోడ్లు దుస్థితికి చేరాయి. వీటిని గత ఎనిమిదేళ్ల క్రితం నిర్మించారు. గంగాధరనెల్లూరు మండల పరిధిలోని తూగుండ్రం రోడ్డులోని ఆవుల కొండ వద్ద గుంతలమయంగా మారింది. అదేవిధంగా కొత్తవెంకటాపురం వద్ద రోడ్డు ధ్వంసమైంది. తమిళనాడు సరిహద్దులో ఉన్న అగ్రహారం రోడ్డు గులక తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది.



కార్వేటినగరం: కంకర తేలిన తమిళనాడు సరిహద్దులోని అగ్రహారం రోడ్డు



కార్వేటినగరం: గుంతల మయంగా తూగుండ్రం రోడ్డు

అధ్వాన్న రోడ్లు

కుప్పం: కుప్పం ప్రాంతంలో చిరుజల్లులకే గ్రామీణ రహదారులు బురదమయమయ్యాయి. మండలంలోని ఊరినాయనిపల్లె కొత్తూరుకు వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. 40 ఏళ్లుగా గ్రామస్తులు రోడ్డు కోసం పోరాటాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. పొలాల్లో ఉన్న రోడ్లు వర్షాలొస్తే రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఈ రోడ్డును బాగు చేయాలని ఎన్నోసార్లు అధికారులు, నాయకులను కోరినా పట్టించుకున్న పాపానపోవడం లేదని ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.



కుప్పం: అధ్వాన్నంగా ఊరినాయనిపల్లె-కొత్తూరు రోడ్డు

వర్షాలొస్తే అంతే!

పుంగనూరు: వర్షాలు వస్తే పుంగనూరు-శంకర్రాయలపేట రోడ్డులో ప్రయాణం నరకప్రాయమవుతోంది. పుంగనూరు నుంచి పుంగమ్మ చెరువు కట్టమీదుగా శంకర్రాయలపేట, బెంగళూరుకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రహదారి దుస్థితికి చేరినా ఎవ్వరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పుంగనూరు: 50 రాళ్ల మొరవలో రహదారిపై గుంతలు

గుంతలు పూడ్చండి మహాప్రభో!



గంగవరం: గుంతల్లో నీళ్లు చేరిన కీలపట్ల రోడ్డు



గంగవరం: ఫ్లైఓవర్ వద్ద గుంతలతో అధ్వాన్నంగా మారిన రోడ్డు

గంగవరం: మండలంలో ప్రధానంగా శ్రీకోనేటిరాయస్వామి ఆలయం ఉన్న కీలపట్ల రోడ్డు అధ్వాన్నంగా మారింది. హైవే ఆనుకుని కీలపట్లకు ఉన్న అనుసంధాన రోడ్డు బురదమయమైంది. ఇక గంగవరం ఫ్లైఓవర్ వద్ద హైవేపై వర్షం కారణంగా భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఫ్లైఓవర్ చుట్టూ ఇదే పరిస్థితి.

న్యాయం గెలుస్తుంది

- జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి



మీడియాతో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

చిత్తూరు కార్పొరేషన్: ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి బెయిల్‌పై బయటకు వచ్చిన చిత్తూరు, జీడీనెల్లూరు, వి.కోటకు చెందిన కార్యకర్తలు చక్రవర్తి, వినోద్, మోహన్, శంకరాచారితో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా జైలు వద్ద వారితో మాట్లాడి, భరోసానిచ్చారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్యాయంపై ప్రశ్నించిన వారిని కేసుల పెట్టి వేధిస్తోందన్నారు. ఆ దిశగానే తన సోదర సమానులైన పార్టీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టారన్నారు. జరుగుతున్న అన్యాయాలను భగవంతుడు, ప్రజలు చూస్తున్నారన్నారు. భవిష్యత్‌లో చేసిన పాపాలకు తగిన శిక్ష అనుభవిస్తారన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, వారి కష్టాలను జగనన్న దృష్టికి ఎప్పటికప్పుడు నాయకులు తెలియజేస్తున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి నాయకులు అంజలిరెడ్డి, హరీషారెడ్డి, మధురెడ్డి, రాజేష్‌రెడ్డి, మురళీరెడ్డి, అన్బు, అను, చామంతి, వెంకట్‌రెడ్డి, గురువారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆగ్రహం

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ లైన్‌మన్(జేఎల్ఎం గ్రేడ్-2) సంఘం నాయకులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జేఎల్ఎం నాయకులు వెళ్లారు. ఉన్నత కొలువులు పొందడానికి శిక్షణ కోసం రాత్రి పూట శిక్షణకు అనుమతివ్వాలని కోరారు. అక్కడే ఉన్న జేసీ విద్యాధరి గతంలో సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని, అత్యవసర సేవల్లో పనిచేస్తున్న వారికి రాత్రివేళ్ల శిక్షణకు దీర్ఘకాలిక అనుమతి ఇవ్వడం కుదరదని చెప్పామన్నారు. కావాలంటే సెలవు పెట్టుకొని శిక్షణ తీసుకోవచ్చని సూచించినట్టు వెల్లడించారు. దీనిపై కలెక్టర్ కల్పించుకుని సంబంధిత అధికారులతో విషయం మాట్లాడినా కొత్తగా తిరిగి సమస్యను తనకు తెలపడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా అధికారులు అనుమతివ్వడం లేదని జెఎల్‌ఎం గ్రేడ్-2 సంఘం నాయకులు చెప్పడం పై అసహనం వ్యక్తం చేశారు. వారిని వెంటనే బయటకు పంపాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్‌ని పిలిచి ఇక్కడ కొచ్చేందుకు జేఎల్ఎంలు అనుమతి, లేదా సెలవు తీసుకున్నరా..? అని ప్రశ్నించారు. తీసుకోలేదని ఆయన చెప్పడంతో వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు నలుగురి నాయకుల పై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఎస్ఈ వివరించారు.

పైరవీలకే 'రిజర్వేషన్'

- రిజర్వేషన్ కౌంటర్‌లో అయినవాళ్లకే పెద్దపీట

నగరి : ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో పైరవీలు రాజ్యమేలుతున్నాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు వేకువ జామునే వచ్చి ఫామ్‌లు నింపి కౌంటర్‌లో ఉంచి గంటల తరబడి క్యూలో నిరీక్షించినా ఫలితం లేని పరిస్థితి. అయినవాళ్లు ఆలస్యంగా వచ్చినా రిజర్వేషన్ అధికారులు వారికే పెద్ద పీట వేస్తున్నారు. వారి ఫామ్‌లనే ముందుగా రిజర్వేషన్‌కు తీసుకుంటున్నారు. ఒక ఫామ్‌కు ఒకరు కచ్చితంగా ఉండాలని ఆదేశాలు జారీచేసే అధికారులు అయినవాళ్లకు మాత్రం ఒక వ్యక్తి వస్తే నాలుగైదు ఫామ్‌లను రిజర్వేషన్‌కు తీసుకుంటున్నారు. దీంతో క్యూలోని వారి ఫామ్ నింపేలోపు సీటు దక్కక వెయిటింగ్ లిస్టులోకి వచ్చేస్తోంది. ఈ కారణంగా నిత్యం రిజర్వేషన్ కౌంటర్ వద్ద క్యూలో నిలబడ్డ వారి మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. రైల్వే ఉన్నతాధికారులు సత్వర చర్యలు చేపట్టి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎలుక దెబ్బకు 'రీసౌండ్'!

పలమనేరు: ఓ ఎలుక కారణంగా జనం బెంబేలెత్తిపోతున్నారు. పలమనేరులోని పద్మశ్రీ సర్కిల్‌లో ఓ ప్రైవేటు బంగారు తనఖా బ్యాంకు ఉంది. ఇందులోని స్ట్రాంగ్ రూమ్‌లో సైరన్‌ను ఏర్పాటు చేశారు. అందులోకి రాత్రిపూట ఓ ఎలుక తరచూ వెళ్తోంది. ఇలా ఎలుక వెళ్లిన ప్రతిసారీ బ్యాంకు బయట గట్టిగా సైరన్ మోగుతోంది. రాత్రుల్లో సైరన్ రావడం రోడ్డుపై ఉన్నవారు ఆ బ్యాంక్‌లో చోరీ జరిగిందేమో అని పరుగులు తీస్తున్నారు. పోలీసులు సైతం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. తీరా అక్కడి చేరుకుని అసలు విషం తెలుసుకుని మిన్నకుండిపోతున్నారు. ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మైనర్ తండ్రిపై కేసు

పుంగనూరు: మైనర్‌కు ద్విచక్ర వాహనం ఇచ్చి ఓ వ్యక్తి మృతికి కారణమైన తండ్రిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 2న వెంకట్రమణ మైనర్ అయిన తన కుమారుడు ద్విచక్రవాహనం నడుపుతూ పట్టణ సమీపంలో చరణ్ అనే వ్యక్తిని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన చరణ్(30) తిరుపతిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు మైనర్‌కి వాహనం ఇచ్చి, ప్రమాదానికి కారణమైన తండ్రిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుండుబావిలో శవమై తేలిన యువకుడు



శవాన్ని పైకి తీస్తున్న స్థానికులు

పలమనేరు: పట్టణంలోని మదనపల్లి రోడ్డులో గల గుండుబావి ఉద్యానవనంలో ఓ యువకుని మృతదేహం మంగళవారం కలకలం రేపింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పైగిలాగారు. అతను పట్టణంలోని లింగాయత్ వీధికి చెందిన గౌతం(30)గా నిర్ధారించారు. ఆపై వారి కుటుంబీకులకు సమాచారాన్ని అందించారు. దీనిపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా గత కొన్నాళ్లుగా గుండుబావి ఉద్యానవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇక్కడ రాత్రులో వ్యభిచారం సాగుతోందని అక్కడి వారు చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే ఇది హత్యా లేక ఆత్మహత్యా అనే విషయం పోలీసుల విచారణలో తేలనుంది.

14 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా మంగళవారం అక్కడక్కడా వర్షాలు కురిశాయి. జిల్లాలో ఈ నెల 19వ తేదీన 14 మండలాల పరిధిలో 0.9 మి.మీ సగటున వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వి.కోటలో 4.2 మి.మీ, అత్యల్పంగా వెదురుకుప్పం, పుంగనూరు, శాంతిపురం, బంగారుపాళ్యం మండలాల్లో 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఎన్జీఓ కార్యవర్గం ఏకగ్రీవం



నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: సిటీ(వాణిజ్య పన్నులు) శాఖ చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎన్జీఓ(నాన్ గెజిటెడ్ అధికారుల) సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం చిత్తూరులో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. రెండు జిల్లాల అధ్యక్షుడిగా ఎ.రాజేష్, అసోసియేట్ అధ్యక్షుడుగా దశరథన్, ఉపాధ్యక్షులుగా బి.సురేష్‌కుమార్‌రెడ్డి, పి.గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీధర్, కార్యాలయ కార్యదర్శిగా వి.పురుషోత్తంనాయుడు, సహాయ కార్యదర్శులుగా కె.రెడ్డిప్రసాద్, సి.జ్యోత్స్న, కోశాధికారిగా జ్ఞానవేల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా ఏపీ ఎన్జీఓ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవ పాల్గొన్నారు. వీరి పదవీ కాలం మూడేళ్లు ఉంటుందని నాయకులు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వారు వివరించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవ పోస్టర్‌ను ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్ వెంకట ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తారన్నారు. మండల వైద్యాధికారులు విధిగా పీహెచ్‌సీల పరిధిలో దోమల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. దోమల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

పేకాటరాయుళ్ల అరెస్టు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో మంగళవారం సాయంత్ర పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గల ఓ మామిడితోటలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు తెలిపారు. దీంతో సిబ్బందితో కలసి పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.6,150 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

మాజీ సైనికుల సంక్షేమానికి లీగల్ ఎయిడ్ క్లినిక్

చిత్తూరు కలెక్టరేట్ : మాజీ సైనికుల సంక్షేమానికి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ భారతి అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాలతో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. దేశం కోసం పోరాడి ఉద్యోగ విరమణ పొందిన మాజీ సైనికుల సంక్షేమానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని మాజీ సైనికులు, కుటుంబ సభ్యులకు ఎలాంటి న్యాయ సలహాలు కావాలన్నా ఇక్కడ సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పారా మిలిటరీ లీగల్ ఎయిడ్ అడ్వైజర్ నాగరాజరెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రజిని, మాజీ సైనికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ భారతి